సాక్షి తిరుపతి

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



మరింత అభివృద్ధికి..

మరింత అభివృద్ధికి వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. - 8లో



మనమే ఫస్ట్

వ్యవసాయ పథకాల్లో తిరుపతి జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. - 8లో

సాహో ఇస్రో

సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లో శనివారం సాయంత్రం ప్రయోగించిన జీఎస్ఎల్‌వీ ఎఫ్-14 ప్రయోగం సూపర్ సక్సెస్ అయ్యింది. - 8లో



న్యూస్‌రీల్

ఊంజల్ సేవలో కల్యాణ వెంకన్న



ఉయ్యాల సేవలో ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఊంజల్ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామి, అమ్మవార్లను మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం పూజా కై ంకర్యాలు పూర్తిచేసి తిరుచ్చి వాహనంపై శ్రీదేవిభూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని అధిష్టింపజేశారు. అనంతరం ఊంజల్ సేవను శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ వెంకటరమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్తీర్ణత శాతం పెరిగేలా ప్రణాళికలు



మాట్లాడుతున్న పాఠశాల విద్య ఆర్జేడీ రాఘవరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా తగిన ప్రణాళికలు రచించుకుని అమలుచేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ ఏ.రాఘవరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుపతి సమీపంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో శనివారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై తిరుపతి జిల్లాలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశాలను రివైజన్ చేయాలన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం అదనపు తరగతులను నిర్వహించాలని చెప్పారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లు, ఇతర వ్యాపకాలపై విద్యార్థుల దృష్టి మరలకుండా వారిని పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ మాట్లాడుతూ గత ఫలితాల్లో జిల్లాకు 8వ స్థానం వచ్చిందని, ఈ సారి మొదటి స్థానంలో నిలిచేందుకు అందరూ సహకరించాలని చెప్పారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ డైరెక్టర్ పీ.గురుస్వామిరెడ్డి, తిరుపతి డీవైఈఓ ఆనందరెడ్డి, డీసీఈబీ కార్యదర్శి వంశీరాజ్, సీఎంఓ సురేష్, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, సర్వశిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

దాగుడుమూతలు



సత్యవేదు నియోజకవర్గంలోని ఆశావహులతో చంద్రబాబునాయుడు చెడుగుడు ఆడుతున్నారు. ఒకరికి తెలియకుండా ఒకరికి ఫోన్లు చేసి నువ్వే అభ్యర్థివంటూ నమ్మబలుకుతున్నారు. ఆపై ఎవ్వరికీ తెలియకుండా తన వాయిస్‌తో వేరొక అభ్యర్థిత్వాన్ని తెరపైకి తెచ్చి ఫోన్ సర్వే చేయిస్తున్నారు. ఇన్నాళ్లూ బాబు మాటలు నమ్మి.. ఆయన హామీలకు తలొగ్గి తీరా మోసపోతామేమోనన్న ఆందోళనలో ఎస్సీ అభ్యర్థులు తికమకపడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం పరిస్థితి అయితే రెంటికీ చెడ్డ రేవడిలా తయారైందని తెలుగు తమ్ముళ్లు చెవులు కొరుక్కుంటున్నారు.

సత్యవేడులో బాబు నాలుగు స్తంభాలాట

- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, మరో ఇద్దరితో చర్చలు
- ఒకరికి తెలియకుండా ఒకరికి నువ్వే అభ్యర్థి అంటూ హామీలు
- వైఎస్సార్‌సీపీని వీడి వస్తే టికెట్ నీకే అని ఆదిమూలంకి కండీషన్
- సీఎం వైఎస్ జగన్‌పై బురదజల్లేందుకు ఎమ్మెల్యేని ఉసిగొల్పుతున్న బాబు
- అయినా ఎమ్మెల్యేకి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని చంద్రబాబు

సాక్షి, తిరుపతి: ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన సత్యవేడు టీడీపీ టికెట్ విషయం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక్కడ మొదటి నుంచి మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్‌కే టికెట్ అని చంద్రబాబు తన వారితో ప్రచారం చేయించారు. 2019 ఎన్నికల్లో సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలైన జేడీ రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య తనకే టికెట్ అని, చంద్రబాబు కూడా స్పష్టం చేశారని వారు చెప్పుకుంటున్నారు. మరోవైపు ఎమ్మెల్యే ఆదిమూలం తనకే టికెట్ అని ప్రచారం చేసుకుంటున్నారు. ఆ మేరకు చంద్రబాబు, లోకేష్ హామీ ఇచ్చారని, అందుకే పార్టీ మారుతున్నట్లు తన అనుచరులకు చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా చంద్రబాబు వాయిస్ రికార్డుతో మొబైల్ ఫోన్ ద్వారా చేపట్టిన సర్వేలో మాజీ ఎమ్మెల్యే గాంధీ మనుమరాలు చందన స్రవంతి పేరు తెరపైకి వచ్చింది. ఈ సర్వేలో స్రవంతి పేరు తప్ప మరొకరి ప్రస్తావన లేకపోవడంతో ఆశావహులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఒకరికి తెలియకుండా ఒకరిని నమ్మించి మోసం చేస్తావా? అంటూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన దళిత నేతలు చంద్రబాబు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆదిమూలం రెంటికీ చెడ్డరేవడేనా?

తాజా సర్వేతో ఆదిమూలం ప్రస్తావనే లేకపోవడంతో ఎమ్మెల్యే, ఆయన వర్గీయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కోనేటి ఆదిమూలం 2001లో కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీలో చేరారు. ఆపై 2004, 2009లో టికెట్ ఆశించి భంగపడ్డారు. తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరి, 2014లో సత్యవేడు నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2019లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ఆదిమూలంనే అభ్యర్థిగా ప్రకటించి కోనేటి కుటుంబానికి ఊపిరిపోశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే ఆదిమూలం ప్రజాసేవపై దృష్టి సారించకపోవడం, ఎస్సీ సామాజికవర్గాన్నే చిన్నచూపు చూడడం, తన కుమారుడు సుమన్ అధికారులు, స్థానికుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, వారిపై చేయిచేసుకోవడం వంటి కారణాలతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆదిమూలంపై వ్యతిరేకత తారాస్థాయికి చేరింది.

వెన్నుపోటుకు సిద్ధమైన ఆదిమూలం

వ్యతిరేకత విషయాన్ని గ్రహించిన ఎమ్మెల్యే ఆదిమూలం ఆలోచనలో పడ్డారు. ఈ సారి తనకు స్థానచలనం తప్పదని భావించిన ఆయన టీడీపీకి దగ్గరయ్యేందుకు ప్రణాళిక రచించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీపై, ప్రభుత్వ పెద్దలపై అసత్యప్రచారం చేయడం ప్రారంభించారు.మంత్రి పెద్దిరెడ్డిపై మరీ చెలరేగిపోయారు. అయినా వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే ఆదిమూలంకి ప్రమోషన్ ఇచ్చి తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా ప్రకటించారు. దీన్ని బూతద్దంలో చూపించేందుకు ప్రయత్నించి భంగపడ్డారు. చంద్రబాబు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఆదిమూలం, కొడుకు సుమన్‌ని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు శ్రీకాళహస్తికి పిలిపించుకుని మంతనాలు నెరిపారు.

కండువా కప్పుకోక ముందే తీవ్ర అవమానం

ఎమ్మెల్యే ఆదిమూలం, కుమారుడు సుమన్ టీడీపీ కండువా కప్పుకోకముందే తీవ్ర అవమానాలు ఎదుర్కొంటున్నారు. నెలరోజులవుతున్నా కనీసం చంద్రబాబునాయుడు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం చూస్తే ఆదిమూలంకి సత్యవేడు అభ్యర్థిత్వం కూడా లేనట్టేనని జిల్లాలో జోరుగా ప్రచారం జరుగుతోంది.

క్యూల నిర్వహణపై అవగాహన



సన్మానం అందుకున్న వారితో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, అధికారులు

తిరుమల(అలిపిరి): భక్తుల రద్దీ క్రమబద్ధీకరణతోపాటు క్యూల నిర్వహణ తదితర అంశాలపై అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ప్రతినిధులకు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి నేతృత్వంలో అధికారులు అవగాహన కల్పించారు. ట్రస్టు ఆహ్వానం మేరకు టీటీడీ అధికారులు శనివారం అయోధ్యకు చేరుకుని ట్రస్టు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాముని ఆలయానికి వచ్చే భక్తులకు సంతృప్తికరంగా దర్శనం కల్పించేందుకు, సౌకర్యాలు సమకూర్చేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేపట్టాలనే విషయాలను టీటీడీ ఈఓను అడిగి తెలుసుకున్నారు. క్యూల నిర్వహణకు సంబంధించి టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు పలు సూచనలు చేశారు. ఈ అవగాహన సదస్సులో అయోధ్య ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ అనిల్‌మిశ్రా, గోపాల్, జీ.జగదీష్ ఆఫ్లే, గిరీష్ సహస్ర భోజని, విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి రాఘవులు, డీఎస్ఎన్ మూర్తి, టీటీడీ సాంకేతిక సలహాదారు జీ.రామచంద్రారెడ్డి, ఎస్ఈ-2 జగదీశ్వర్ రెడ్డి, డెప్యూటీ ఈఈలు బాబు, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రగిరి వలంటీర్లకు సన్మానం

- ముస్తాబైన ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియం
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



చంద్రగిరిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి (ఫైల్)

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని 2,010 మంది వలంటీర్లను సన్మానించే కార్యక్రమానికి ఆదివారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియం వేదిక కానుంది. చంద్రగిరి-344, చిన్నగొట్టిగల్లు-157, పాకాల-327, రామచంద్రాపురం -144, తిరుపతి రూరల్-899, ఎర్రావారిపాళెం -139 ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,010 మంది వలంటీర్లు ఉన్నారు. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. చారిత్రక ఆడిటోరియాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఏడు రకాల మాంసాహార వంటలతో పసందైన నాన్ వెజ్ విందును ఏర్పాటు చేస్తున్నారు. శనివారం సాయంత్రం వలంటీర్ల సన్మాన కార్యక్రమ ఏర్పాట్లను తుడా చైర్మన్ పరిశీలించారు.

దశదిశలా తిరుపతి పవిత్రత

- అభివృద్ధితోపాటు ఆధ్యాత్మికతకు పెద్దపీట
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, కార్పొరేటర్లు, కమిషనర్ అదితి సింగ్

తిరుపతి తుడా: తిరుపతి నగర అభివృద్ధి, పవిత్రత దశదిశలా విస్తరిస్తోందని, అభివృద్ధిలో ఆధ్యాత్మికతకు పెద్దపీట వేశామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. చెన్నారెడ్డి కాలనీ - హరేకృష్ణ రోడ్డును కలుపుతూ నూతనంగా అభివృద్ధి చేసిన కనెక్టివిటీ రోడ్డును శనివారం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ రహదారికి అభయ చరణారవింద 'భక్త వేదాంతస్వామి ప్రభుపాదుల' పేరును నామకరణం చేశారు. అనంతరం మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితిసింగ్, డిప్యూటీ మేయర్, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, ఇస్కాన్ అధ్యక్షులు రేవతి రమణదాస్‌తో కలిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ తిరుపతి పవిత్రతను మరింత ఇనుమడుంపజేస్తూ ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా తాము రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. ఈ క్రమంలోనే రహదారులకు శ్రీవారి తొలి సేవకులు, ఇతర పుణ్యమూర్తుల పేర్లను నామకరణం చేస్తున్నట్టు వెల్లడించారు. బాలాజీ కాలనీ కూడలి వద్ద నిత్యం సంగీత ధ్వని వినిపించేలా అభివృద్ధి చేసినట్టు తెలిపారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ నగరానికి సరైన రహదారులు, ఇతర ప్రాంతాల నుంచి కనెక్టివిటీ, లింక్ రోడ్లు ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ తాము చేసిన పనులు గుర్తించి రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. చెన్నారెడ్డి కాలనీలో పునర్నిర్మిస్తున్న కృష్ణమనాయునికుంట పనులను పరిశీలించారు. కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, పుణీత, వరికుంట్ల నారాయణ, ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకులు రేవతి రమణదాస్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈ విజయకుమార్‌రెడ్డి, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, నాయకులు బొగ్గుల వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్, శ్యామల, పెరుగు బాబుయాదవ్, వంశి, రాజశేఖర్, శివకుమార్, బాలసుబ్రమణ్యం, బెల్లం రమేష్, దేవదానం, సురేష్‌రాయల్, జక్కాశరత్, పాముల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవుట్ స్టాండింగ్ విద్యాసంస్థగా సీకాం



భారత క్రికెట్ కెప్టెన్ రోహిత్ శర్మ నుంచి అవార్డు స్వీకరిస్తున్న సీకాం విద్యా సంస్థ డైరెక్టర్లు

తిరుపతి సిటీ: తిరుపతి సీకాం విద్యా సంస్థలకు ప్రముఖ లియో ఒన్ సంస్థ అవుట్ స్టాండింగ్ ఇన్స్టిట్యూట్ ఇన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్-2024 అవార్డును ప్రకటించింది. ముంబై కేంద్రంగా శనివారం ఆ సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును ఇండియన్ క్రికెట్ టీమ్ కెప్టెన్ రోహిత్ శర్మ చేతుల మీదుగా సీకాం సంస్థల డైరెక్టర్లు టి.తేజస్వరూప్, ప్రణీత్ స్వరూప్‌లు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంస్థల చైర్మన్ డాక్టర్ టి.సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అవార్డు రోహిత్ శర్మ చేతుల మీదుగా అందుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. సీకాం విద్యా సంస్థ విద్యారంగంలో 44ఏళ్లుగా చేసి విశేష కృషికి ఫలితంగా ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా 2023లోనూ ఇంటర్నేషనల్ స్కూల్ అవార్డ్స్ సంస్థ సీకాం విద్యాసంస్థకు ఎక్సలెన్స్ ఇన్ కో-కరికులమ్ యాక్టివిటీ అవార్డును ప్రకటించిందని గుర్తుచేశారు. సంస్థ అభ్యున్నతికి కృషి చేసిన కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మరింత అభివృద్ధికి మరో అవకాశం


సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం


గజమాలతో అపూర్వ స్వాగతం పలుకుతున్న మేర్లపాక గ్రామస్తులు

- ప్రతి క్షణం ప్రజల గురించే ఆలోచిస్తాం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ఏర్పేడు: అభివృద్ధే అజెండాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని, ఇదే ఒరవడితో మరింత అభివృద్ధి చేసేందుకు మరో అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని మేర్లపాక పంచాయతీ పరిధిలోని మేర్లపాక, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, కొత్తకండ్రిగ గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యేతోపాటు ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులు క్రేన్ ద్వారా తమ అభిమాన నేతలకు గజమాలతో ఆత్మీయంగా సత్కరించి, పూల వర్షం కురిపించారు. అనంతరం ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు గ్రామాల్లోని 340 కుటుంబాలను కలిశారు. మన్నసముద్రం, కొత్తకండ్రిగ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పక్కాగృహాలు, ఇళ్ల స్థలాలు, మురుగునీటి కాలువల నిర్మాణాలు తదితర సమస్యలను పరిష్కరించాలని స్థానికులు విన్నవించగా.. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాలుగన్నరేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా రక్షణకు, సాధికారికతకు ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు వివరించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికే సీఎం జగనన్న గడపగడపకు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్టు వెల్లడించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రజాసంక్షేమ పథకాలను సక్రమంగా అందించాలనే ఉద్దేశంతోనే గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌లు గంగాధరం, పెంచలయ్య, రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ భరత్‌కుమార్, వైస్ ఎంపీపీ తిరుపతి జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, పార్టీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు హరినాథరెడ్డి, శంకరయ్య, చంద్రయ్య, సీవీరమణయ్య యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, లోకనాథంరెడ్డి, దామోదరంరెడ్డి, వెంకటేష్ యాదవ్, చంద్రశేఖర్, బాలాజీ, గున్నయ్య, యల్లయ్య, రమేష్, రవిచంద్ర, కేశవులురెడ్డి, శంకర్, గణేష్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ మద్దిల గురుమూర్తి

మేర్లపాక గ్రామంలో టీడీపీకి చెందిన 30 మంది నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చింత బత్తెయ్య, చింత దివాకర్, అక్కుపల్లి పూర్ణచంద్ర, బిల్లు భాస్కరయ్య, తదితర 30 మంది ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ మద్దిల గురుమూర్తి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరగా.. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వైఎస్సార్‌సీపీతోనే మా ప్రయాణం

–టీడీపీ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు


మాట్లాడుతున్న కరకంబాడికి చెందిన సుధారాణి, తులసి, జయంతి, నవీంద్ర

రేణిగుంట : మా ప్రయాణం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనేనని, తాము టీడీపీలో చేరినట్లు వస్తున్న ప్రచారాన్ని నమ్మొద్దని కరకంబాడికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సుధారాణి, తులసి, జయంతి, నవీంద్ర స్పష్టం చేశారు. రేణిగుంట మండలం కరకంబాడిలో శుక్రవారం టీడీపీ నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరినట్లు పచ్చమీడియాలో వార్తలు వచ్చాయి. బొజ్జల సుధీర్‌రెడ్డి పచ్చ కండువా కప్పిన వారంతా టీడీపీకి చెందిన వారేనని స్థానికులు చెబుతున్నారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన సుధారాణి, తులసి, జయంతి, నవీంద్ర కూడా టీడీపీలో చేరినట్లు ప్రచారం చేశారు. ఈ ప్రచారాన్ని ఆ నలుగురు తీవ్రంగా ఖండించారు. తాము పార్టీ మారలేదని, వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కరోనా సమయంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా కాపాడారని, పౌష్టికాహారం, విటమిన్ ట్యాబ్లెట్లు, గుడ్లు, చికెన్, కూరగాయలు, పండ్లు ఇలా ఎన్నో నేరుగా తమ ఇంటికే చేర్చి ఆదుకున్నారని గుర్తుచేశారు. అటువంటి నాయకులను కాదని తాము టీడీపీలోకి వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

మనమే ఫస్ట్

తిరుపతి అర్బన్: వ్యవసాయశాఖ పరిధిలో ప్రభుత్వం అందిస్తున్న పథకాల్లో తిరుపతి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శనివారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్బీకే వ్యవస్థ ఎంతో గొప్పదన్నారు. ప్రతిరైతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం చిరుధాన్యాలతో రుచికరమైన 100 రకాల వంటలు పుస్తకాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని సేవలను అందుబాటులో ఉంచామని వివరించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా సిరికల్చర్ అధికారిణి గీతారాణి, మైక్రో ఇరిగేషన్‌శాఖ అధికారి సతీష్, నీటిపారుదలశాఖ అధికారి వెంకటరమణ, వ్యవసాయశాఖ ఏడీ ధనంజయ రెడ్డి పాల్గొన్నారు.

సాహో ఇస్రో

- జీఎస్ఎల్‌వీ ఎఫ్14 ప్రయోగం విజయవంతం
- నింగిలోకి చేరిన ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహం
- సంబరాల్లో మునిగితేలిన యంత్రాంగం

సూళ్లూరుపేట: సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లో సంబరాలు మిన్నంటాయి. షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి జీఎస్ఎల్‌వీ ఎఫ్14 ప్రయోగాన్ని శనివారం సాయంత్రం 5.35 గంటలకు విజయవంతంగా ప్రయోగించారు. ఈ ప్రయోగాన్ని 18.47 నిమిషాల్లోనే ముగించి 2,275 కిలోలు బరువు కలిగిన ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఇన్‌శాట్–3 సిరీస్‌లో మూడో ఉపగ్రహాన్ని ప్రయోగించారు. వాతావరణ పరిశోధన, విపత్తుల గురించి ముందస్తు సమాచారాన్ని అందించేందుకు ఉపయోగపడే ఉపగ్రహాన్ని ప్రయోగించారు. ఈ ఉపగ్రహం ఐదు నుంచి పదేళ్ల వరకు సేవలను అందిస్తుంది.

నందడే నందడి

సూళ్లూరుపేట: షార్‌లో ప్రయోగించిన జీఎస్ఎల్‌వీ ఎఫ్14 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు ఐదువేల మందిదాకా తరలివచ్చారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్లు, బస్సులు బారులు తీరాయి. రాకెట్ నింగికేగుతున్న సమయంలో వారంతా కొట్టిన చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. జీఎస్ఎల్‌వీ ఎఫ్14 ప్రయోగం విజయవంతం కావడంతో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.



ప్రయోగం ఇలా ..

- జీఎస్ఎల్‌వీ ఎఫ్14 రాకెట్‌కు శుక్రవారం మధ్యాహ్నం 2.05 కౌంట్‌డౌన్ ప్రారంభం
- శనివారం సాయంత్రం 5.35 గంటలకు ప్రయోగం
- కోర్ అలోన్ దశలో 138.1 టన్నుల ఘన ఇంధనం, రాకెట్‌కు చుట్టూరా ఉన్న నాలుగు స్ట్రాపాన్‌బూస్టర్లలో నింపిన 170.7 టన్నుల ద్రవ ఇంధనాన్ని మండించి మొదటి దశ 2.31 నిమిషాలకు పూర్తి
- రాకెట్‌లోని రెండో దశను 2.29 నిమిషాలు మండించి 4.90 నిమిషాలకు పూర్తిచేశారు. ఈ దశలోనే రాకెట్ శిఖరభాగంలో ఉపగ్రహాన్ని అమర్చిన హీట్‌షీల్డ్ 3.57 నిమిషాలకు విడిపోయాయి.
- మూడోదశ అంటే క్రయోజనిక్ దశను 4.55 నిమిషాలు మండించి 18.46 నిమిషాలకు కటాఫ్ అయింది. ఆ తరువాత 18.47 నిమిషాలకు ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడంతో ప్రయోగం పూర్తయింది.